## నమస్తే తెలంగాణ

# మీడియాకు ముకుతాడు

*బ్రాడ్‌బ్యాండ్ ఇంటర్నెట్ విస్తరణ పుణ్యమా అని ఇంటింటా వినోదం కుప్పలు తెప్పలు అవుతున్నది. మరీ ముఖ్యంగా ఓటీటీ రాకతో సినిమాలు, సిరీస్, డాక్యుమెంటరీస్ చూసినవారికి చూసినంత అన్నట్టుగా అందుబాటులోకి వచ్చాయి. ఈ విస్ఫోటనం ఫలితంగా కార్యక్రమాల రూపసారాల్లో పెనుమార్పులు రావడం సహజం. కొత్తగా ఏ మాధ్యమం వచ్చినా దానిపై తగిన నియంత్రణ ఉండాలనే విషయంలో సమాజంలో ఏకాభిప్రాయం ఉంటుంది. ప్రజా ప్రయోజనాల పరిరక్షణకు ప్రతి ప్రజాస్వామిక వ్యవస్థలో అది అవసరం కూడా. అయితే ఆ నియంత్రణ ఏ రూపంలో, ఏ స్థాయిలో ఉండాలనేది వివాదాస్పదమవుతున్నది. కేంద్రం తాజాగా విడుదల చేసిన ఓటీటీ చట్టం ముసాయిదా విషయంలోనూ అదే జరిగింది.*

*కాలం చెల్లిపోయిన కేబుల్ టెలివిజన్ నెట్‌వర్క్స్ నియంత్రణ చట్టం (1995) స్థానంలో కొత్త చట్టం తీసుకురావాల్నని మోదీ ప్రభుత్వం ప్రతిపాదించింది. దీనికి బ్రాడ్ కాస్టింగ్ సర్వీసెస్ బిల్లు అని పేరు పెట్టారు. 'సులభ వాణిజ్యం', 'సులభ జీవన విధానం' అనే ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా దీన్ని రూపొందించినట్టు కేంద్ర సమాచార, ప్రసార శాఖమంత్రి అనురాగ్ ఠాకూర్ గొప్పగా చెప్పుకొన్నారు. కానీ వాస్తవంలో 'బిల్లు సులభ నియంత్రణ', 'సులభ క్రమబద్ధీకరణ' లక్ష్యంగా రూపొందించారని విమర్శలు రావడం గమనార్హం. మీడియా నియంత్రణ విషయంలో బీజేపీ రికార్డు ఏమంత బాగా లేకపోవడం ఈ విమర్శలకు ఊతం ఇస్తున్నది. విభజించి పాలించు అనే మతోన్మాద ఎజెండాతో మీడియాను గుప్పిట్లోకి తీసుకునేందుకు బీజేపీ సర్కారు పావులు కదపడం తెలిసిందే. అయితే వాటికి దేశభద్రత, ప్రజా సామరస్యం అనే అందమైన ముసుగులు వేస్తున్నది.*

*2021 ఐటీ నిబంధనలపై చెలరేగిన వివాదం ఈ సందర్భంగా గుర్తుకురాక మానదు. ఇంటర్నెట్ నుంచి పోస్టులను తొలగించే అధికారం ప్రభుత్వ నియంత్రణలో ఉన్న అధికారులకు కల్పించడం వల్ల ఏం జరుగుతుందో ఊహించుకోవచ్చు. ప్రతిపాదిత చట్టం ముసాయిదాలోనూ ఇదే తరహాలో ఓ నిబంధనను చేర్చడం ప్రభుత్వ ఉద్దేశాలను వెల్లడిస్తున్నది. రకరకాల అంశాలతో పాటుగా మత సామరస్యానికి భంగకరంగా ఉండే కంటెంటును తొలగించే అధికారం పరిపాలనా వ్యవస్థలో భాగమైన అధికారికి ఇవ్వడమనేది ఇక్కడా ఉంది. ఇలాంటి నిబంధనలను ప్రభుత్వం దుర్వినియోగం చేసే అవకాశాలు ఉంటాయనేది గుర్తుంచుకోవాల్సిన అంశం. దేశ ప్రయోజనాలు, ప్రభుత్వ ప్రయోజనాలను కలగాపులగం చేసి పబ్బం గడుపుకొనే ధోరణి మంచిది కాదు. రెండింటి మధ్య విభజన రేఖను గుర్తిస్తే గానీ, ఈ సమస్యకు పరిష్కారం లభించదు. ఎలాంటి మీడియా నియంత్రణ గురించైనా ఆలోచించే ముందు దీన్ని తప్పనిసరిగా దృష్టిలో ఉంచుకోవాల్సిందే.*

# సోమరి కాంగ్రెస్ పగటి కలలు

**కొన్ని నెలలుగా పడమటి గాలులు తెలంగాణ ప్రాంతాన్ని చుట్టుముడుతున్నాయి. సముద్ర తీరం లేకుండా చుట్టూ భూమి మాత్రమే ఉన్న ఈ పదేండ్ల రాష్ట్రంలోకి పశ్చిమ లేదా వాయువ్య సరిహద్దుల నుంచి కాంగ్రెస్ 'అలలు' చొచ్చుకు వచ్చేస్తున్నాయట. వాటివల్ల తెలంగాణలో 'కాంగ్రెస్ పార్టీకి ఊపు వచ్చినట్టు, కన్నడ గాలులే తెలంగాణలో హస్తం పార్టీని గట్టెక్కిస్తాయ'నే ప్రచారం ఒక వర్గం మీడియాలో సాగుతున్నది. ఏ మాత్రం హేతుబద్ధం కాని ఈ వింతవాదన గత తొమ్మిదిన్నరేండ్లుగా అధికారం లేకుండా నీరసించి ఉన్న తెలంగాణ కాంగ్రెస్ నేతలకు దింపుడుగల్లం ఆశలయ్యాయి.**



నాంచారయ్య మెరుగుమాల
79819 42329



కన్నడ కాంగ్రెస్ గెలుపుతో తెలంగాణ కాంగ్రెస్ పోయిన ప్రాణాలు లేచివచ్చాయని చాటింపు వేసుకుంటున్నారు. 2023 మండుటెండల్లో కర్ణాటక ఎన్నికల ఫలితాల ప్రభావం తెలంగాణలో జరుగనున్న శాసనసభ ఎన్నికలపై ఉంటుందనేది కొందరు కాంగ్రెస్ అనుకూల ఎన్నికల విశ్లేషకుల అభిప్రాయం. ఇది ఆకాంక్షగా ఉంటే ఫరవాలేదు కానీ, దాన్ని ఎల్లకాలాలకూ వర్తించే రాజకీయ సూత్రంగా ప్రచారం చేయడమే మానసిక సోమరితనం. తాము కోరుకుంటున్న ఈ ఫలితం 'ఆజ్మాసిస్' (ద్రవాభిసరణం) అనే భౌతికశాస్త్ర ప్రక్రియ మాదిరిగా ఉంటుందని ఈ రాజకీయ పండితులు ప్రచారం చేస్తున్నారు. దక్షిణాదిన సాగరతీరం లేని ఏకైక రాష్ట్రమైన తెలంగాణపై సరిహద్దు రాష్ట్రాల రాజకీయ పరిణామాల ప్రభావం అనేది సమయం, సందర్భాల మీద ఆధారపడి ఉంటుంది. ఊరికే పదే పదే ఊదరగొడితే ఏం లాభం? అయితే, కన్నడ రాజకీయం ఇక్కడ పునరుక్తమవుతుందని, తమను గద్దెనెక్కిస్తుందనే భ్రమల్లో తెలంగాణ కాంగ్రెస్ నేతలు గత కొద్ది నెలలుగా బతుకుతున్నారు.

తెలంగాణ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుస్తుందని చెప్పడానికి కర్ణాటక ముస్లింలు ఆ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో మూకుమ్మడిగా హస్తం గుర్తుకు ఓట్లేశారనే వాదన తీసుకొస్తున్నారు. ఐదేండ్ల అస్తవ్యస్త పాలనపై వ్యతిరేకతతో మిగిలిన సామాజికవర్గాల మాదిరిగానే మైనారిటీలు కూడా అక్కడ అధిక సంఖ్యలో కాంగ్రెస్ వైపు మొగ్గి ఉండవచ్చు. అంతేగానీ, అక్కడి రాజకీయ పరిస్థితులకు, తెలంగాణ పరిస్థితులకు ఏ మాత్రం పొంతన లేదని బుర్ర ఉన్న ఎవరికైనా అర్థమవుతుంది. అసలు కన్నడ శాసనసభ ఎన్నికల్లో పాలకపక్షమైన బీజేపీకి, ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్‌కు మధ్య ప్రధానంగా పోటీ జరిగింది. 2018 అసెంబ్లీ ఎన్నికల తర్వాత హెచ్‌డీ కుమారస్వామి నేతృత్వంలోని జేడీఎస్ కాంగ్రెస్ సంకీర్ణ సర్కారు ఏడాది రెండు నెలలకే అంతర్గత వైరుధ్యాలతో కుప్పకూలిపోయింది. కొందరు పాలక కూటమి ఎమ్మెల్యేల ఫిరాయింపుతో తర్వాత బీఎస్ యడియూరప్ప, బసవరాజ్ బొమ్మయి నాయకత్వాన దాదాపు నాలుగేండ్లు గందరగోళ పాలన సాగింది. అప్పట్లో రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో ముస్లిం ఆడపిల్లలు ధరించే హిజాబ్ వంటి సున్నిత అంశాలతో బీజేపీ సర్కారు చెలగాటమాడింది. మైనారిటీలు భయోత్పాతానికి గురయ్యేలా చేసింది. ఈ పరిస్థితుల్లో ముస్లింలు అధిక సంఖ్యలో 2023 కన్నడ ఎన్నికల్లో బీజేపీకి వ్యతిరేకంగా మరో జాతీయపక్షానికి ఓటేసి ఉండవచ్చు. కానీ, అసలు పేరుకు త్రిముఖ పోటీగా కనిపిస్తున్న తెలంగాణ ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి వచ్చే అవకాశమే లేనప్పుడు, అది గత ఐదేండ్లుగా పాలకపక్షం కానప్పుడు ఇక్కడి ముస్లింలు కాంగ్రెస్ పార్టీకి గంపగుత్తగా ఓటు వేసి గెలిపిస్తారనేది గోబెల్స్ ప్రచారమే. ముస్లింల భద్రతకు గాని, వారి సంక్షేమానికి గాని ఎలాంటి ఇబ్బంది లేని తెలంగాణలో మైనారిటీలు హస్తం పార్టీకి దగ్గరవుతున్నారని కొందరు పరిశీలకులు వేస్తున్న అంచనా ఏ మాత్రం హేతుబద్ధంగా లేదు. ఐదేండ్లుగా తెలంగాణలో నడుస్తున్నది లౌకిక విధానాలు అనుసరించే ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వం అని పైన చెప్పిన ప్రచారహోరులో చిక్కుకున్న రాజకీయ పండితులు మర్చిపోతున్నారు.

> తెలంగాణలో కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్ మొదటినుంచి ముందంజలో ఉన్నది. రాష్ట్రంలో 2014 జూన్ నుంచి అమలు చేస్తున్న సంక్షేమ పథకాల కారణంగా బీఆర్ఎస్ బలం చెక్కు చెదరలేదు. గ్రామీణ ప్రాంతాల్లో ఈ పార్టీకి ఏర్పడిన విస్తృత పునాది స్థిరంగా ఉన్నది.

> ఇతర రాజకీయపక్షాల అజెండాలను గుంజుకొని తనవిగా ప్రచారం చేసుకోవడం కాంగ్రెస్‌కు అలవాటే. 1960ల చివరలో, 1970ల మొదట్లో కమ్యూనిస్టుల అజెండాలోని కొన్ని అంశాలను నాటి కాంగ్రెస్ మాజీప్రధాని ఇందిరాగాంధీ తన సొంతవిగా చెప్పుకొంటూ వరుసగా 1971 పార్లమెంట్, 1972 అసెంబ్లీల ఎన్నికల్లో విజయం సాధించారు. అప్పట్లో కాంగ్రెస్ నేతల నోట 'సోషలిజం' అనే మాట తెగ వినిపించేది. ఇప్పుడు కూడా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ తన నాయనమ్మ మార్గంలో పయనిస్తున్నారు.

'లోహియా సోషలిజం' తమ లక్ష్యమని చెప్పుకొనే సమాజ్‌వాదీ పార్టీ, ఆర్జేడీ, జేడీయూ వంటి జనతా పరివార్ పార్టీలు పదిహేనేండ్లుగా చేస్తున్న 'కులగణన' డిమాండ్‌ను తన ఒరిజినల్ ఐడియాలా కాంగ్రెస్ పార్టీ పదే పదే ప్రచారం చేసుకుంటున్నది. ఓబీసీల సంక్షేమం కోసమే కులాలవారీ జనాభా లెక్కలు సేకరించాలంటున్న కాంగ్రెస్ ఇప్పుడు అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్న ప్రధాన రాష్ట్రాల్లో వెనుకబడిన కులాలవారికి ఇచ్చిన టిక్కెట్లు చాలా తక్కువ. మధ్యప్రదేశ్‌లో పాలకపక్షం కన్నా కాంగ్రెస్ తక్కువమంది బీసీ నేతలకు అసెంబ్లీ టికెట్లు ఇచ్చింది. ఆరున్నర శాతం ముస్లిం జనాభా ఉన్న మధ్యప్రదేశ్‌లో ఈ వర్గం నేతలు ఇద్దరికి మాత్రమే బీఫారాలు ఇచ్చింది. నిజానికి కులగణన ప్రభావం హిందీ రాష్ట్రాల్లోనే ఎక్కువ. తెలంగాణలో ఎంతో ఆర్భాటంగా ప్రతి పార్లమెంటు స్థానంలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో రెండేసి చోట్ల బీసీలకు టికెట్లు ఇస్తామని గొప్పగా ప్రకటించుకున్న కాంగ్రెస్ వాస్తవానికి బీఆర్ఎస్ కన్నా తక్కువ మంది బీసీలను బరిలో నిలిపింది. ఏకకాలంలో మైనారిటీలను, ఓబీసీలను మాయచేయడం సాధ్యం కాదని డిసెంబర్ 3న ఈ 'గ్రాండ్ ఓల్డ్ పార్టీ' (జీఓపీ)కి అర్థం కాబోతున్నది.

తెలంగాణలో కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్ మొదటినుంచి ముందంజలో ఉన్నది. రాష్ట్రంలో 2014 జూన్ నుంచి అమలు చేస్తున్న సంక్షేమ పథకాల కారణంగా బీఆర్ఎస్ బలం చెక్కు చెదరలేదు. గ్రామీణ ప్రాంతాల్లో ఈ పార్టీకి ఏర్పడిన విస్తృత పునాది స్థిరంగా ఉన్నది. 'కాంగ్రెస్ ఇక్కడ పుంజుకుంటున్నదని నిరూపించడానికి కొన్ని సంస్థలు చేసిన సర్వేలకు పద్ధతి, పాడు లేదు' అని ఇటీవల ఇంగ్లిష్ న్యూస్ చానల్ 'ఇండియా టుడే'లో ప్రముఖ ఎన్నికల విశ్లేషకుడు, ప్రసిద్ధ రాజకీయ, సామాజికశాస్త్రాల అధ్యయన సంస్థ సెంటర్ ఫర్ ద స్టడీ ఆఫ్ డెవలపింగ్ సొసైటీస్ (సీఎస్‌డీఎస్) ఎన్నికల సర్వేల విభాగం 'లోక్‌నీతి' సహ సంచాలకుడు డాక్టర్ సంజయ్‌కుమార్ వ్యాఖ్యానించారు. గత రెండేండ్లలో జరిగిన యూపీ, పంజాబ్, ఉత్తరాఖండ్ తమిళనాడు తదితర రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై సంజయ్‌కుమార్ అంచనాలు నిజమయ్యాయి. 'కంటి వెలుగు' వంటి అనేక వినూత్న పథకాలు 45 శాతానికి పైగా తెలంగాణ ఓటర్లను మూడోసారి కేసీఆర్‌ను ముఖ్యమంత్రి చేయడానికి ప్రేరేపిస్తాయనే అంచనా నూరు శాతం నిజమయ్యేలా ఉంది. తెలంగాణ ఉద్యమ పార్టీగా అవతరించిన బీఆర్ఎస్ దేశ తూర్పు తీరంలోని పశ్చిమబెంగాల్, ఒడిశాలోని ప్రాంతీయ పాలక పక్షాల మాదిరిగానే మూడు దశాబ్దాలకు పైగా ఎన్నికల్లో విజయం సాధిస్తూనే ఉంటుందని, కాంగ్రెస్ నేతలు తమ కలల్లో అనుభవిస్తున్న 'కన్నడ రాజ్య గాలులు' తెలంగాణపై ఎలాంటి ప్రభావం చూపించలేవనేది సత్యం.

# నిర్మాణ సమయమిది, అలసత్వం వద్దు

**తెలంగాణ ఇప్పుడు క్రాస్‌రోడ్‌లో నిలబడి ఉన్నది. ఇప్పటిదాకా నడిచిన దారి ఇక్కడినుంచి రెండుగా చీలనున్నది. ఒకటి నిర్మాణపు రహదారి. రెండవది విధ్వంసపు వినాశక దారి. రెండూ ఒకేలా కనిపించడం ఇప్పుడు తెలంగాణలో జరుగుతున్న కనికట్టు.**



జూలూరు గౌరీశంకర్



ఓటు కూడా యుద్ధంలో భాగంగా చూసి మరీ ఓటెయ్యాలి. యువత ఇందులో ప్రధాన పాత్ర పోషించాలి. ఎట్లున్న తెలంగాణ? ఎట్లయిన తెలంగాణ?ఎట్లుండాల్సిన తెలంగాణ? అన్నదానిపై బరాబర్ చర్చించాలి. తెలంగాణ ఊరంటే.. తెలంగాణలో పోరాటాల ఆరాటాలంటే.. తెలంగాణలో బతుకు సమరమంటే.. తెలంగాణలో అణచివేతలపై జరిగిన తిరుగుబాట్లంటే.. మామూలువి కావు. బిడ్డల్లారా మీరు ఆలోచించండి. కాంగ్రెస్‌లో పెత్తందారీతనం ఎలగబెట్టిన పెద్దలెవరో.. వాళ్లు తెలంగాణను అరువై ఏండ్లు ఎంత ధ్వంసం చేసిండ్రో తెలుసుకొని అడుగువేయాలి. యువ స్నేహితుల్లారా.. మీకు తెలంగాణలో ఎన్నెల చూడని రాత్రులుండేయి తెలుసా? రాచకొండ గుట్టల నుంచి 'దారెంట పోతుంటే ఎలమందా వాడు చిన్నా పోరగాడు ఎలమందా' అన్న పాట ల్లోతుల్లోకి ఒక్కసారి సూడండి. యువ బిడ్డల్లారా.. తెలంగాణలో నరమేధం లాంటి ఎన్‌కౌంటర్ల నెత్తురు ముద్దల శవాల గుట్టలు ఎవరివి? వాళ్లెవరు? ఎవరి పాలనల్లో ఎన్‌కౌంటర్ల నెత్తురుతో ఈ నేల మరుభూమిగా మారిందో ఆలోచించాలి. యువ నేస్తాల్లారా... తెలంగాణలో పదిహేనేండ్ల కిందట, ఇప్పుడు మీ వయస్సులో ఉన్న పిల్లలు తుపాకులు పట్టుకొని అడవుల బాటెందుకు పట్టారో ఆలోచించాలి. నేస్తాల్లారా.. మీ వయస్సు బిడ్డలు బొంబాయి, బొగ్గుబాయి, దుబాయిలకు వలసెందుకు పోయారో ఆలోచించండి. యువకుల్లారా.. వలసలకు.. గోదావరి లోయ తీరం వెంబడి ప్రవహించిన నెత్తురుటేర్లు ఏ తల్లి పేగులు తెగిన బిడ్డలవో ఒక్కసారి గుండె పెట్టి ఆలోచించండి.

> యువతీ యువకుల్లారా... 'సాపాటు ఎటూ లేదు పాటైనా పాడు బ్రదర్.. రాజధాని నగరంలో వీధి వీధి నీది నాదే బ్రదరూ' అన్న పాట హైస్కూళ్ల నుంచి యూనివర్సిటీల వరకు కంజీర్లపై డప్పుకొడుతూ వీధి వీధి యువత తిరుగుతూ పాటలు పాడటానికి ఏ పార్టీ జెండాల నేతలు కారకులో ఒక్కసారి సింహావలోకనం చేయండి.

కొత్తతరం యువకుల్లారా.. నాగార్జునసాగర్ ఎడమ కాల్వకు నీళ్లు లేక లక్షలాది ఎకరాలు ఎండిపోతుంటే చూస్తూ కాలక్షేపం చేస్తూ ఎన్నికల్లో మాయమాటలతో గెలుస్తూ 60 ఏండ్లు గద్దెలెక్కి పాలించిన పెత్తందార్లు ఎవరో... జానపాడు సైదులు, మెదక్ చర్చీ, లింగమంతుని జాతర, సమ్మక్కసారక్కల సాక్షిగా ఆలోచించాలి. నవయువకుల్లారా.. పోడు భూముల కోసం ఎంత మంది నేలకొరిగారో ఒక్కసారి వెనక్కి తిరిగి బయ్యారం, కొమరారం గుట్టలనడగండి, ఆదిలాబాద్ గోండన్నల గుండెల నడగండి చెప్తాయి. చివికిపోయి శిథిలావస్థకు చేరుకున్న ప్రభుత్వ బడుల దుస్థితికి అసలు కారకులెవరో లోతుగా ఆలోచించాలి.

ప్రభుత్వ బడులను చంపి కార్పొరేట్ విద్యకు ప్రాణం పోసి, వాటి తలుపులు తెరిచిన పెద్దలెవరో?, ఏ పెత్తందారులో?, ఏ పార్టీ నేతలో ఒక్కసారి ఆలోచించండి. యువకుల్లారా.. కృష్ణా, గోదావరి జలాలు ఎగువ భూములకు వెళ్లవని అరువై ఏండ్లు తెలంగాణను నీళ్లు లేకుండా ఎండబెట్టి కరువు ప్రాంతాలుగా మార్చిందెవరో ఒక్కసారి ఈ సందర్భంగా మననం చేసుకోవాలి. దళిత, బహుజన పేదవర్గాల తల్లుల పగిలిన పాదాల సాక్షిగా తాగు నీళ్ల కోసం కోసుల కొద్దీ పోయి కడవలతో, కుండలతో నడిచిన నడకల దారులు ఏ పల్లెనడిగినా చెప్తాయి వినండి. ఇంటింటికి నల్లా అన్నది పథకం మాత్రమే కాదు, అది తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి సంబంధించిన ముఖ్య విషయం అన్నది గుర్తెరగాలి. గోరటి వెంకన్న నల్ల తుమ్మ చెట్టు పాట సాక్షిగా తెలంగాణ గట్టులు గుట్టలు పచ్చబడి జీవాలకు మేత దొరుకుతుంది. ఒక్క తెలంగాణలోనే ఎండకాలంలో కూడా చెరువులు అలుగులు పారి, మత్తళ్లు దుంకుతున్నాయి. పాలమూరు గంజి కేంద్రాలు పోయి వలసలు ఆగిపోవటం మామూలు విషయం కాదు. యువ సామాజిక శాస్త్రవేత్తల్లారా ఆలోచించండి. ఏ పార్టీల హయాంలో హైదరాబాద్‌లో మత ఘర్షణలు, కత్తిపోట్ల సంఘటనలు, కర్ఫ్యూలు వచ్చాయో అవగతం చేసుకోవాలి. తెలంగాణ వచ్చినంక గంగా జమునా తెహజీబ్ సంస్కృతికి పట్టం గట్టింది నిజం. తెలంగాణ ప్రజల జీవన ప్రమాణాలు పెరుగుతున్నాయి. మహాత్మా జ్యోతిబా పూలే, సావిత్రి బాయి పూలే ఆలోచనా దారుల్లో 1,002 గురుకులాలు వచ్చాయి. ఇది దేశంలో ఏ రాష్ట్రంలో లేనిది. పూలే ఆలోచనాదారుల్లో సంచారజాతుల బిడ్డలు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లుగా ఎదుగుతున్నారు. తెలంగాణ వచ్చినంక ప్రభుత్వ కొలువుల్లో నియామకాల సంఖ్య పెరిగింది. ప్రైవేటు సంస్థల్లో ఉద్యోగాల సంఖ్య పెరిగింది. తెలంగాణ తనను తాను పునర్నిర్మించుకుంటున్నప్పుడు అన్నీ ఒక్కసారిగా జరుగవు. కానీ, అన్నీ జరగాలి. అందరికీ న్యాయం జరగాలి. సమన్యాయం, సమభావం, సమతా రాజ్యం దిశగా అడుగులు వేయాలి.

> 'సంపద పెంచాలి– సంపద పంచాలి'. అన్నార్తులు, అనాథలుండని ఆకలిరాజ్యాలు లేని సుఖ శాంతుల తెలంగాణ పకడ్బందీగా నిర్మించబడాలి. ఇపుడు తెలంగాణలో ఆకలితో చనిపోయేవాళ్లు కనిపించరు. తెలంగాణ దేశానికే ధాన్యాగారమైంది. ఇది మామూలు విషయం కాదు. పల్లె.. పట్టణంగా, పట్టణం.. నగరంగా, హైదరాబాద్ దేశానికే గుండెకాయగా మారటమన్నది రాష్ట్ర అవతరణ తర్వాత జరిగిన పరిణామక్రమంగా చెప్పాలి. పాలనారంగ విప్లవాలు, ఆరోగ్య తెలంగాణ, హరిత తెలంగాణ, పల్లె, పట్టణ ప్రగతులు వేగవంతంగా జరుగుతున్న మార్పులను చూడాలి.


రేపటి ఎన్నికల్లో గట్టెక్కడానికి ఎవరెవరు ఎన్నెన్ని మాటలైనా చెప్పవచ్చును. తెలంగాణకు దార్శనిక ఆలోచనలు గల నాయకుడెవరో చైతన్యవంతమైన తెలంగాణ ప్రజలు గుర్తించగలరు. మాయాలాంతరులా భ్రమింపజేసి అబద్ధాల్ని నిజాలు చేసి, నిజాలను అబద్ధాలు చేసి గందరగోళ ప్రచారాలను చైతన్యవంతమైన తెలంగాణ సమాజం గుర్తించగలదు. ఎన్నికల సభల నుంచి ఇండ్లకు పోయినంక తప్పక ఆలోచించాలి. అప్పటి తెలంగాణకు, స్వరాష్ట్ర తెలంగాణకు తేడాను చర్చించాలి. తెలంగాణ స్వీయ రాజకీయ అస్తిత్వం ఏ విధంగా తెలంగాణకు కవచమో లోతుగా పరిశీలించాలి. ఇన్నాళ్లు తెలంగాణను విధ్వంసం చేసిందెవరు? తెలంగాణను పునర్నిర్మిస్తున్నదెవరు?అన్న విషయం ఆలోచించే తెలంగాణ తీర్పునిస్తుంది. తెలంగాణ మోసపోదు. పైపై మెరుగులకు భ్రమ పడదు. తన దారేదో తనకు బాగా తెలుసు.

**నేను రెండొద్దులు పోన్జెయ్యకుంటే సాలు మా అజ్జిరాలు ఆగమాగమైతది. 'పోరడు పోన్జెయ్య పాయెన'ని మా చెల్లెండ్లను, తమ్ముళ్లను పోన్ గల్పియ్యిమని బతిలాడుతదట. ఇంటికి వోయినప్పుడు మావోళ్లు నాతోని శెప్తరు. ఎప్పట్లెక్కనే ఏదో పని మీద ఉండి నిన్న, మొన్న అజ్జిరవ్వకు పోన్జెయ్యలే. కతం, రానే అచ్చే అజ్జిరవ్వ నుంచి పోన్..**

# రామశిల్క నవ్వింది



గడ్డం సతీష్
99590 59041



'హల్లో చెప్పమ్మా..'

'హల్లో... ఏడున్నవ్ రా, ఏం జేత్తున్నవ్ రా..?'

'ఇంకేడుంటనే, పట్నంలనే ఉన్న'

'మరి పోనే జేత్తలెవ్వు, ఒక్క ముచ్చట మాట్లాడేటందుకు తీరుత లేదా తీరికలేకుంటా అంతగనం సంపాయిస్తున్నావ్రా?'

'గడియ రికాం లేదు, గవ్వ రాకట లేదే..'

'మర్రెనటా.. మనకు శాత్రాలు తక్కువొస్తయా గని, ఇంతకు తిన్నవా, లేదా?, ఏం కూర..?'

'మా తిన్న గని... నువ్వు తిన్నవా మరి'

'నేన్గూడ తిన్న గని...' అని ఏదో ముచ్చట అడుగవోతున్నది గని అడిగేటందుకు అనుమానవడుతున్నది.'ఏందే అమ్మా.. ఏదో అడ్గవొయి ఆగవడ్తివి?'

'ఏ, ఏం లేదురా'

'ఏమన్న పైసల్ గావాల్నాయే..?'

'ఓ ఇగ నువ్వితే నేను ముల్లె గట్టుకున్న తియ్, ఇంటికొచ్చినప్పుడు నువ్వే నా బొడ్లె సంచి సదురకుంటా మా సాల్ తియ్, ఎన్కట మీ అయ్యగూడ గిట్లనే బొడ్ల సంచి ఏడవెట్టినా పోశమ్మ మాయం జేసినట్టే జేత్తుండె'

'మరేంటిదే...'

'ఏం లేదురా.. కేసీఆర్ 20 తారీఖు నాడు మానకొండూర్ అత్తుండని ఇనవడ్తున్నది. నిజమేనారా?'

'నిజమేనే కేసీఆర్ మన మానకొండూరుకు అత్తున్నడు. ఎందుకేగా ముచ్చట అడ్గవడ్తివి..'

'అయ్యో.. గట్లంటున్నవేందిరా? మన మానకొండూరుకు కేసీఆర్ అత్తే ఆయ్నెను నన్ను గల్పిత్తవారా?'

'ఎందుకే? కేసీఆర్‌ను నువ్వు గల్సి ఏం జేత్తవే?'

'అయ్యో గట్లనవడ్తివేంది బిడ్డా? ఉన్న ఇల్లు, తిన్న రేవు మర్వద్దు బిడ్డా..' అని గతాన్ని యాజ్జేసింది అజిరవ్వ.

***

*2022, డిసెంబర్ 11. మమ్మల్నిడ్శివెట్టి వోయిన బాపును దోల్కొని నిమ్స్ నుంచిబైటికి అచ్చినం. తెల్లారి బాపును దానం జేసినంక... 'వారీ... ఊరు గాని ఊరాయె.. పల్లె గాని పల్లెనాయె.. గా పట్నంకు తీస్కవొయి గంతగనం కర్సు వెట్టుకున్నా బాపు దక్కకవాయె బిడ్డా' అని ఏడ్వవట్టింది.*

'అమ్మా.. బాపు మనకు దక్కకపాయె అనే బాధొక్కటేనే.. బాపును బతికించుకునేటందుకు నేనొక్కన్నే గాదు, కేసీఆర్ ప్రభుత్వమే మస్తు ప్రయత్నం జేసిందే. సీఎం కేసీఆర్ ఆఫీసులకెళ్లి శానా మంది నిమ్స్ డాక్టర్లతోని మాట్లాడిర్రె.. నా చేతిగుంట ఒక్క రూపాయి గూడ వెట్టనియ్యలేదు వాళ్లు' అన్జెప్పిన.

***

> ఆ ముచ్చటను యాజ్జేస్కున్న అజ్జిరవ్వ.. 'ఆపదొచ్చిందని ఊరు గాని ఊరికి వోతే మనసొంటి పేదోళ్లను గూడ అక్కున చేర్చుకున్న మంచి మనిషిరా కేసీఆర్. ఆయ్న ఇప్పుడు మానకొండూరుకు అత్తుండని దెల్సి మనం గల్వకుంటె పద్ధతి అనిపిచ్చుకోదురా..' అన్జెప్పవట్టింది.

'సరే.. మా గల్పిత్త గని. ఇంతకు మానకొండూరుల ఎవ్వలొత్తున్నరే'..

'ఇంకెవ్వలొత్తర్రా.. కాంగ్రెసోళ్లే రోజు అత్తున్నరు, పోతున్నరు. వాళ్లకు ఓట్లప్పుడే ప్రజలు గుర్తుకొస్తరాయె.. అందుకే కాలుగాలిన పిల్లి లెక్క రోజు తిర్గుతున్నరు...'

'అయ్యో రాములా... అట్లగాదె, అచ్చే ఎలచ్చన్లల్ల ఎవ్వల్ గెలుస్తున్నరంటున్నా..'

'ఒహ్హో అట్లనా, ఇంకెవ్వలు గెలుత్తర్రా... మోయేడు (తొలిపొద్దు కార్యక్రమంలో భాగంగా) మన బాపుతోని పోట్వా దిగి నీకు పంపిండు సూడు గాయ్ననే గెలుస్తడు'..

'మరి కాంగ్రెసోళ్లు బాగనే తిరుగుతర్రు అంటున్నవ్ గదనే. వాళ్లు పైసలిత్తే నువ్వేం జేస్తవే...?'

'నేన్దీస్కుంటనా బిడ్డా.. తీస్కుంటే నువ్వూకుంటవా? అయినా పైసలు వాళ్లే ఇయ్యవట్టిరి, తీసుకునేటోళ్లు పైసలియ్యిమని ఏమన్న అడుగుతున్నరా బిడ్డా. అయినా ఎవలన్న పైసల్ ఇయ్యంగ అద్దంటరారా?.. ఇచ్చినోళ్లు ఇస్తర్రు, తీస్కునేటోళ్లు తీస్కుంటర్రు గనీ ఓటు మాత్రం కారుకే అంటుర్రురా.. తెలంగాణ పార్టీ రాకుంటే తెలంగాణ ఆగమైతది గాదు బిడ్డా. ఈ ముచ్చట మనోళ్లందరికెర్కె. మీదికి ఎవ్వలంటలేరు గని, పోతరు సక్కగా కారుకే గుద్దుత్రా ఓటు'

'సరే తియ్యే నేనుంటా ఇగ. నీతోని ముచ్చట వెడ్తే ఒడ్శిపాడు గాదు..'

'అయితమాయెగని కేసీఆర్‌ను కల్పిచ్చుడు మాత్రం మర్శిపోకు బిడ్డో. మనం మర్యాద దప్పినోళ్లమైతం.'

'సరేనమ్మా.. బాపుతోని సెల్ఫీ పోట్వ దిగినా రసమయే నిన్ను కేసీఆర్‌ను గల్పిత్తడు తియ్..' అనంగల అజ్జిరవ్వ నవ్వులు పకపకా ఇనవడ్తున్నయి. అజ్జిరవ్వ నవ్వుతే ఎట్లుంటదో ఎర్కేనా? సేమ్ రామశిల్క లెక్కనే..!